పట్టు తప్పుతోంది

- ఉష్ణోగ్రతలు తగ్గడంతో పట్టుగూళ్లకు తెగుళ్లు
- దిగుబడి, నాణ్యతపై తీవ్ర ప్రభావం
- వెలవెలబోతున్న మార్కెట్



బోసిపోయిన పట్టుగూళ్ల మార్కెట్

మదనపల్లె సిటీ: పట్టు మార్కెట్ వెలవెలబోతోంది. చలి తీవ్రతకు పట్టుగూళ్లకు సున్నపుకట్టు తెగుళ్ల సోకడంతో గూళ్లు మార్కెట్‌కు రావడం లేదు. దీంతో మార్కెట్ స్తంభించిపోయింది. మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్ జిల్లాలోనే అతి పెద్దది. మార్కెట్‌కు ఈనెల 8 నుంచి 24వ తేదీ వరకు పట్టుగూళ్లు పూర్తిగా రాలేదు. వాతావరణ మార్పులు, దిగుబడులు తగ్గిపోవడంతో గూళ్లు రావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. గతంలో పట్టుగూళ్ల మార్కెట్‌కు ప్రతి రోజు 1,000 కేజీల నుంచి 2,000 కేజీల వరకు వచ్చేవి. జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి గూళ్లు వచ్చేవి. నిత్యం రైతులు, వ్యాపారులతో మార్కెట్ కిటకిటలాడేది. అలాంటిది చలి తీవ్రత ఎక్కువ కావడంతో సున్నపుకట్టు తెగులు తీవ్రకావడంతో పాటు ఆశించినంత పంట సాగు లేదు. దిగుబడి అంతంతమాత్రమే ఉండగా మార్కెట్‌లో మంచి ధర పలకాలి. కానీ పట్టు గూళ్లల కొనుగోళ్లకు రీలర్లు ముందుకురాకపోవడంతో ఆశించిన ధరలు రావడం లేదు. దీనితోడు రైతులకు ప్రోత్సాహకాలు అందకపోవడంతో పొరుగు రాష్ట్రమైన కర్నాటకలోని శిడ్లగట్టకు వెళుతున్నారు.

ఉష్ణోగ్రతలు తగ్గకుండా చూసుకోవాలి

పట్టుగూళ్ల షెడ్లలో ఉష్ణోగ్రతలు తగ్గకుండా చూసుకోవాలని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. లేకపోతే పట్టుగూళ్లు సున్నపుకట్టుబారిన పడి దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని తెలిపారు. షెడ్లలో రాత్రిళ్లు కనీసం 20 డిగ్రీలు తగ్గకుండా ఉష్ణోగ్రత ఉండేలా చేసుకోవాలని చెబుతున్నారు. కొందరు రైతులు షెడ్లలో బొగ్గుల కుంపటి లేదా హీటర్లు పెట్టి వేడిని పెంచుకోవాలని సూచిస్తున్నారు. అలాగే మార్కెట్‌కు గూళ్లు తెచ్చే ముందు కూడా ఆరోజు చివరగా అల్లిన గుడ్డులో పురుగు ప్యూపా అయిందో లేదో గుడ్డును చాకుతో కోసి పూర్తిగా ప్యూపా దశలో ఉంటేనే మార్కెట్‌కు తీసుకువస్తే ఆశించిన ధర లభిస్తుందని రైతులు చెబుతున్నారు.

సున్నపుకట్టుతో నష్టాలు



చలి ప్రభావంతో పట్టుగూళ్ల నాణ్యత కోల్పోతోంది. ఎంతో వ్యవప్రయాసలకోర్చి పంట పెడితే నష్టాలు చవి చూడాల్సి వస్తోంది. ధరలు బాగా ఉంటాయనుకుంటున్న సమయంలో తెగుళ్లు సోకి నష్టపోతున్నాం. సున్నపుకట్టు తెగుళ్లతో గూళ్లను రీలర్లు కొనుగోలు చేయడం లేదు.

–రమణ,రైతు, రామసముద్రం

క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి



మాట్లాడుతున్న అగ్రికల్చర్ అధికారులు

ములకలచెరువు: వ్యవసాయశాఖ సిబ్బంది ఈ పంటల నమోదు, ఈకేవైసీ తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి. చంద్రానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో పీటీఎం, ములకలచెరువు మండలాలకు చెందిన సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లో రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా సీఏ ల్‌ఎస్, ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ ద్వారా పంటల చీడపీడలను, సూక్ష్మపోషక లోపాలను ప్రతి రోజూ నమోదు చేయాలన్నారు. ఆర్‌బీకేలలో రైతులకు అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శివశంకర్, ఏఓలు డి. లీలా కుమారి, ఆర్. ప్రమీళా, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఉరుసు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం వన్నూర్ సాహెబ్ గుట్టలో వెలసిన బాబా ఏహసానుల్లా దర్గా ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దర్గాను రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా పీఠాధిపతి బాబా నసీబుల్లాఖాన్‌వార్సీ ధార్మికోపన్యాసం చేశారు. మహిళలు బాబాకు హారతి పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ దర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. బాబా దగ్గర నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. ఉరుసు ఉత్సవాలకు స్థానికులు దర్గాలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

బి.కొత్తకోట: మండలంలోని గుమ్మసముద్రంలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని ఆ శాఖ ఏడీ శ్రీధర్ రెడ్డి నిర్వహించారు. ఆవులు, దూడలు, గొర్రెలకు వ్యాక్సిన్లు వేశారు. నట్టల నివారణ ముందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దేవరింటి కుమార్, రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే లక్ష్యం



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చర్చిస్తున్న ఎంపీపీ, అధికారులు

రామసముద్రం: ప్రజారోగ్యమే లక్ష్యమని ఎంపీపీ కుసుమకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు కావాల్సిన వసతులపై చర్చించారు. అలాగే ఆస్పత్రి అభివృద్ధికి సంబంధించిన విషయాల గురించి సమీక్షించారు. రామసముద్రం పీహెచ్‌సీ అభివృద్ధికి కృషిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మెడికల్ ఆఫీసర్లు లీల, డాక్టర్ సునీత, ఎంపీడీఓ భానుప్రసాద్, ఆర్‌ఐ వసీం తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో ఎస్‌బీఐ బ్యాంక్ ప్రారంభం



పూజలు చేస్తున్న బ్యాంకు అధికారులు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన శాఖ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం నిమ్మనపల్లెలోని మదనపల్లి రోడ్డు, వెంకోజిగారిపల్లెలోని పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌బీఐ నూతన శాఖను ఎస్‌బీఐ చిత్తూరు ఆర్.బి.ఓ హెచ్.ఆర్ మేనేజర్ బి.శిరీష, హెచ్.ఆర్ డిస్క్ ఆఫీసర్ చంద్రశేఖర్, బ్యాంక్ మేనేజర్ భాను ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సత్వర ఆర్థిక లావాదేవీలను నిర్వహించుకోవడానికి ఎస్‌బీఐలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. సోమవారం నుంచి ప్రజలకు బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు సుధాకర్ రావు, ఓబుల్ రెడ్డి, క్యాష్ ఇన్‌చార్జి మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

అధైర్యపడవద్దు.. అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

రామసముద్రం : వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ భరోసా ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని చెంబకూరులో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముస్లింల ఆహ్వానం మేరకు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కార్యకర్తలతో వైఎస్సార్ సీపీ బలోపేతానికి పలు అంశాలపై చర్చించారు. కూటమిప్రభుత్వం ఏర్పడిన ఏడునెలలకే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీకి మంచి భవిష్యత్తు ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలో ఉన్నా, లేకున్నా.. ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడమే అందరి బాధ్యత అని అన్నారు. మదనపల్లెలో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేందుకు వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని త్వరలో ఎంపీ మిథున్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణ, కో–ఆప్షన్ షంషీర్, కేశవరెడ్డి, భాస్కర్ గౌడ్, నందకిషోర్ రెడ్డి, దొడ్డిపల్లె ఆనంద, రాధారెడ్డి, సుజ్ఞానమూర్తి, మున్వర్‌బాషా, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, సదుం రవీంద్ర, దండువారిపల్లె శ్రీనివాసులు, రాజన్న, కృష్ణమూర్తి, బషీర్, షఫీ, విజయ్ రాజు, శంకర, ముత్తవల్లి పీరుసాహెబ్, నజీర్, సాదిక్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి



మాజీ ఎమ్మెల్యే చింతలతో నాయకులు

కలికిరి (వాల్మీకిపురం): గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని కేవీపల్లి మండలం గాలివారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాంప్రసాద్ నాయుడు నూతనంగా పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శుక్రవారం వాల్మీకిపురం మాజీ ఎమ్మెల్యే కాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియచేశారు. పార్టీ బలోతానికి చేపట్టాల్సిన ప్రణాళికలపై వారికి ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూచనలిచ్చారు. వాల్మీకిపురం పంచాయతీ ఉప సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, కేవీపల్లి మండల పార్టీ నాయకులు రామచంద్రయ్య నాయుడు, సిద్దయ్యనాయుడు, శ్రీనివాసులునాయుడు, రామాంజినేయులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె : మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి టి.హరి శర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి టి.హరిశర్మ మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు 17 రోజుల సమ్మె సందర్భంగా హామీలు, జీవోలు రాతపూర్వకంగా ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని 7 నెలల నుండి కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నా స్పందన లేదన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ ఈఎస్‌ఐ సమస్య పరిష్కరించాలని రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం, జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు, డైలీ వేజ్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. కార్మికులకు పనిముట్లు బట్టలు, సబ్బులు చెప్పులు శానిటైజర్లు, మాస్కులు గ్లౌజులు, చీపుర్లు వెంటనే ఇవ్వాలన్నారు. సీఐటీయూ నాయకులు పి.శ్రీనివాసులు, జి. కష్ణమూర్తి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్షులు కే.చలపతి నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబశివ పాల్గొన్నారు.

హమాలీలకు కూలీరేట్లు పెంచాలి

మదనపల్లె : సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శుక్రవారం మార్కెట్‌యార్డులోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను మూసివేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ హమాలీ కూలీ పెంపుదల 13 నెలలుగా అమలుకావడం లేదన్నారు. సివిల్ సప్లయ్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలి రేట్లు పెంచాల్సి ఉండగా, కూలి రేట్లు జీవోల కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరం అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవా,పట్టణ కార్యదర్శి తిరుమల, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు నర్సింహులు,అయూబ్ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తాం

పీలేరు : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లస్థలాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పీలేరు పట్టణ పరిసర ప్రాంతాల్లోని ఏపీఐఐసీ లేఅవుట్‌లు 1, 2, 3, 4, తిరుపతి రోడ్డులోని చర్చి సమీపంలో స్థలాలను పరిశీలించారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు దూరం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎస్పీ

మదనపల్లె : వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు సంభవించకుండా ఉంటాయని డీఎస్పీ కొండయ్య నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద నుంచి విద్యార్థులు స్వచ్ఛంద సంస్థ సభ్యులు పోలీస్ సిబ్బందితో కలిసి, జాతీయ రహదారి భద్రత మహోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగించడంతో పాటు వేగ నియంత్రణపై వివరించారు. కార్యక్రమంలో సీఐలు కళా వెంకటరమణ, ఎరిషావలి, రామచంద్ర, రమేష్, ఫోర్డ్ లలితమ్మ పాల్గొన్నారు.

ఊరేగింపులు, ర్యాలీలు నిషిద్ధం

రిపబ్లిక్ డే సందర్భంగా కేవలం గణతంత్ర దినోత్సవ వేడుకలకు తప్ప రాజకీయ పార్టీల ఊరేగింపులు, ర్యాలీలు నిషేధమని డీఎస్పీ కొండయ్యనాయుడు తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటుగా కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీ, ఆస్పత్రిని ప్రభుత్వమే నిర్వహించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కాలేజీ, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహణ జరపాలని, ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తే బహుజన్‌సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ వందేళ్లకు పైగా నిరుపేదలకు వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రిని ప్రైవేట్‌పరం చేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం తగదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అనేక హామీలను గుప్పించిన చంద్రబాబునాయుడు, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకొక్క ప్రభుత్వ సంస్థను ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయతిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా ఆస్పత్రి, మెడికల్ కాలేజీ విషయంలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో 27వ తేదీ సబ్ కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న మహాధర్నాకు ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలన్నారు. బీఎస్పీ నాయకులు బాలాజీ, గంగాధర్, శివ, మహేష్, ప్రశాంత్, హరి, కన్నయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ

– ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

కలికిరి (వాల్మీకిపురం): ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వాల్మీకిపురం మండలం చింతపర్తికి చెందిన వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్లంకి నరసింహులు, చింతపర్తి గ్రామం పాతకోటపల్లికి చెందిన ఎం.రఘునాథరెడ్డి కార్లు శుక్రవారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో చింతపర్తి బాహుదానది బ్రిడ్జి వద్ద ఢీ కొన్నాయి. రఘునాథరెడ్డికి చెందిన కారు బ్రిడ్జిపై నుంచి పడి నుజ్జు నుజ్జు అయింది. ప్రమాదంలో నల్లంకి నరసింహులు, రఘునాథరెడ్డికి గాయలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వీఆర్‌ఏ మృతికి సంతాపం

కలికిరి: మండలంలోని పల్లవోలు గ్రామ వీఆర్‌ఏ ఎ.వెంకటరమణ(65) గురువారం ఉదయం మృతి చెందాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో ఆయన ఇబ్బంది పడుతుండేవాడు. సమాచారం తెలుసుకున్న తహసీల్దారు మహేశ్వరిబాయి, వీర్‌ఒలతో కలిసి మృతుని స్వగ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులు అర్పించారు. ప్రభుత్వ లాంచనం మేరకు రూ.25వేలు మృతుని అంత్యక్రియలకు గాను కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసినట్లు వారు శుక్రవారం తెలిపారు. వీఆర్‌ఒలు ప్రసాద్‌రెడ్డి, సుల్తాన్ బాషా, నరేష్, ఆదిలక్ష్మీ, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

బాలికా విద్యతోనే నవ సమాజ స్థాపన



మదనపల్లె సిటీ: విద్యార్థికి బహుమతులు అందజేస్తున్న లలితమ్మ



పీలేరు : అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో..



పెద్దతిప్పసముద్రం: చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో భాగ్యమ్మ

మదనపల్లె సిటీ: నవ సమాజ స్థాపన బాలికా విద్యతోనే సాధ్య పడుతుందని ఫోర్డు డైరెక్టర్ జిల్లా లలితమ్మ అన్నారు.

శుక్రవారం స్థానిక బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఫోర్డు ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. కుటుంబంలో తల్లిదండ్రులు, సమాజం. ప్రజాప్రతినిధులు, అధికారులు బాలికల అభివృద్ధికి సహకరించాలన్నారు. బాలికలు సంపూర్ణ విద్యను పూర్తి చేసినప్పుడే దేశం కూడా అభివృద్ధి దశలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రఘు, ఫోర్డు సిబ్బంది నరసింహ, అల్తాఫ్, స్వర్ణకుమారి, జయలక్ష్మి, జలజ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

బాలికలు ఎందులోనూ తక్కువకాదు

పెద్దతిప్పసముద్రం: బాలికలు ఎందులోనూ తక్కువ కాదని సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ వారి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ బాలికల విద్యా ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. అదే విధంగా బాలికల కోసం కల్పించిన హక్కులు, చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–టూ గౌస్‌పీర్, సూపర్‌వైజర్లు జయరాణి, నాగరత్నమ్మ, భవాని పాల్గొన్నారు.

ఘనంగా బాలిక దినోత్సవం

పీలేరు : స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో, ఐసీడీఎస్ కార్యాలయంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ రాజమ్మ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. దేశాభివృద్ధికి బాలికల విద్య కీలకమైందని పేర్కొన్నారు. బాలికలకు ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు స్వర్ణ, స్వరూప, ఉమ, అక్కయ్యమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి కృషి చేద్దాం

కేవీపల్లె: బాలికల అభివృద్ధికి కృషి చేద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల హక్కులు, విద్య, ఆరోగ్య, సమానత్వం, ఎదుగుదలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. బేటీ పడావో, బేటీ బచావో గూర్చి వివరించి బాలికలతో ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్, మహిళా పోలీస్ శివకుమారి, రెడ్డెమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాయమాటలకు మోసపోకండి

బి.కొత్తకోట : ఎవరైనా మాయమాటలతో మోసగించే ప్రయత్నం చేస్తే అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ భాగ్యమ్మ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఎంఈఓ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ బాలికలు లక్ష్య సాధనతో శ్రమించి ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హిజాబ్ ప్యారీ, ప్రత్యేక అధికారి విశ్వలత, అంగన్‌వాడీ కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల విద్యతోనే మహిళా సాధికారత

కలకడ : బాలికల విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత అన్నారు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ గరడప్పగారిపల్లెలోని ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. శాంత మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, హక్కులు, చట్టాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమిత్ర, మహిళా పోలీస్ సుజాత, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

నియామకం

కలికిరి: పీలేరు పట్టణానికి చెందిన న్యాయవాది, మాజీ ఏజీపీ వల్లెపు చిన్నరెడ్డెప్పను పీలేరు డివిజన్(ఆపరేషన్స్) ఏపీ ఎస్పీడీసీఎల్ బోర్డ్ లీగల్ కౌన్సిల్‌గా నియమిస్తూ తిరుపతి ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి నెల 1 నుంచి 2028 జనవరి నెల 31 వరకు మూడేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. 28 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో ఉంటున్నారు. ఆయనకు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

కలిచెర్ల ప్రభాకరరెడ్డి సేవలు మరువలేనివి

పెద్దమండ్యం: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకరరెడ్డి సేవలు మరువలేనివని నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయన అభిమానులు పేర్కొన్నారు. కలిచెర్లలో శుక్రవారం ప్రభాకరరెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా బస్టాండు కూడలిలో ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళిలర్పించారు. రైతులు, ప్రజలు అభివృద్ధి కోసం ఆయన కృషి చేశారని నాయకులు కొనియాడారు. కలిచెర్ల సమీపంలోని ఆయన సమాధి వద్ద మాజీ సింగిల్ విండో చైర్మన్ కడప సుధాహరరెడ్డి ఘనంగా నివాళిలర్పించారు. ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మధూకర్‌రెడ్డి, మండల కన్వీనర్ చాంద్‌బాషా, కాంగ్రెస్ నాయకులు ఎంఎన్ చంద్రశేఖరరెడ్డి, మస్తాన్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎస్ బాషా, విశ్వనాథరెడ్డి, జింకా విశ్వనాథ, విజయకుమారి, మంచూరి జయరాం, బోడెం రవితేజ పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం

నిమ్మనపల్లె: పశు సంపదను కాపాడుకుందామని పశుసంవర్ధక శాఖ మదనపల్లె డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో జరుగుతున్న పశు ఆరోగ్య శిబిరాలను వెటర్నరీ ఏడీ రోహిణి తో కలిసి తనిఖీ చేశారు. పశువులకు వేస్తున్న నట్టల నివారణ మందులను పరిశీలించారు. పశువులు, దూడలు, గొర్రెలు, మేకలలో వ్యాధుల నివారణకు అవసరమైన మందులను సకాలంలో అందజేయాలన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మదనపల్లె: బైక్ ఢీకొని వ్యక్తి గాయపడిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. కురబలకోటకు చెందిన నరసింహులు ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. సాయంత్రం హోటల్‌కు అవసరమైన పిండి తీసుకుని రోడ్డులో నడిచివస్తుండగా, ఎదురుగా బైక్‌లో వచ్చిన యువకుడు నరసింహులును ఢీకొన్నాడు. ప్రమాదంలో గాయపడిన బాధితుడినిఆస్పత్రికి తరలించారు.